సేంద్రియం.. నేలకు బలం!

- సేంద్రియ ఎరువులతో భూసారం
- పశువుల గెత్తం, గొర్రెల వ్యర్థాలు వేసుకోవాలి
- విరివిగా నేలకు పోషకాలు లభ్యం

గుమ్మలక్ష్మీపురం:

సేంద్రియ ఎరువులు వినియోగిస్తూ వ్యవసాయం చేస్తే నేల సారవంతం కావడంతో పాటు పంటలు బాగా పండుతాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులైన పశువుల గెత్తం, గొర్రెలు, మేకల వ్యర్థాలు, చెరువు మట్టి వాడాలని సలహా ఇస్తున్నారు.

ఇలా చేస్తే నాణ్యమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది రైతులు కూడా సేంద్రియ వ్యవసాయానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సాగులో సంప్రదాయ పద్ధతులను అవలంబిస్తున్నారు.

నేలలో వేసి దున్నుకోవాలి..

పంటల సాగుకు ఎరువుగా పశువులు, మేకలు, గొర్రెల వ్యర్థాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే వీటిని దుక్కి పనులకు ముందు పొలాల్లో అక్కడక్కడ కుప్పలుకుప్పలుగా వేసుకుని, దున్నుకోవాలి. ఇలా చేస్తే అవి నేలలో పూర్తిగా కలిసి భూసారం పెరుగుతుంది. తద్వారా మంచి పంట దిగుబడులు చేతికివస్తాయి. ఎకరానికి నాలుగైదు ట్రాక్టర్ల గెత్తం వేసుకోవాలి.


పొలానికి తరలించేందుకు సిద్ధం చేసిన పశువుల గెత్తం

-ఎండాకాలంలో వేస్తే ఆవిరైపోతాయి..

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువు(గెత్తం)ను పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఎండల వేడికి వాటిలోని పోషకాలు ఆవిరవుతాయి. ఈ నేపథ్యంలో పశువుల పేడను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. నేలలో తగిన తేమ ఉన్న సమయంలోనే ఆ ఎరువును పొలం వ్యాప్తంగా వెదజల్లి వెంటనే దుక్కి చేయాలి. దీంతో నేలలోని అమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి పోషకాలు మొక్కలకు పుష్కలంగా అందుతుంది. దీంతో రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చు.

వాలుకు అడ్డంగా దున్నాలి..

పొలాన్ని ఎలా పడితే అలా దున్నితే సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. వేసవిలో మెట్టభూములను వానాకాలం కోసం సన్నద్ధం చేస్తుంటారు.

మొక్కలకు పోషకాలు అందుతాయి..

పశువులు, మేకలు, గొర్రెల వ్యర్థాలు కలిగిన సహజ ఎరువులు పొలాల్లో వేసుకోవడం వల్ల నేలసారం బాగుంటుంది. పంట మొక్కలకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అందుతాయి. దీంతో రైతులకు ఖర్చు కూడా తగ్గుతుంది.

-సీహెచ్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, గుమ్మలక్ష్మీపురం

మెట్ట ప్రాంతాల్లోని భూమిని వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందుకంటే వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి చేస్తే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.

దోమల నివారణ మందు పిచికారీ

జియ్యమ్మవలస రూరల్:

మండలంలోని నిమ్మలపాడు, బట్లభద్ర గ్రామాలు సహా కురుపాం మండలంలోని సీతంపేట, పూతికవలస గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ సోమవారం చేపట్టారు. కురుపాం మలేరియా నివారణ సబ్ యూనిట్ ఆఫీసర్ రాధాకృష్ణ ఈ స్ప్రేయింగ్ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.


నిమ్మలపాడులో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అని తెలిసినా స్పందించరా..

పాలకొండ రూరల్: పాలకొండ మీదుగా వీరఘట్టం వయా జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు ఒడిశాలోని రాయగడకు వెళ్లే మార్గంలో కీలకమైన గజాలాఖానా వంతెన నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వంతెన సైడ్ వాల్స్ దగ్గర పేరకుపోయిన మట్టి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఈ కారణంతో వంతెన పైభాగంలో పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఇదే పరిస్థితి రానున్న వర్షాకాలంలో కొనసాగితే ఈ చువ్వలు తుప్పు పట్టి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


వంతెన సైడ్ వాల్స్ వద్ద మట్టితో మూసుకుపోయిన వృథా నీరు బయటకు పోయే రంధ్రాలు

పిచ్చిమొక్కలు తొలగించండి


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

జియ్యమ్మవలస రూరల్: మండల తహసీల్దారు కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్మశానవాటికల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తుప్పలు, డొంకలు ఏపుగా పెరిగి ఉండడం వల్ల అసౌకర్యంగా ఉందని, పాములు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు.


తహసీల్దారు కార్యాలయం వెనక ఇలా..

ఘనంగా 'యోగాంధ్ర'


యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సీతంపేట: మండల పరిధిలోని అడ్వంచర్ పార్కులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం యోగసనాలు వేశారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఎస్సై వై.అమ్మన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యలబ్ధి..

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఆరోగ్య లబ్ధి పొందవచ్చని యోగా శిక్షకుడు కె.జనార్ధనరావు అన్నారు. యోగాంధ్రా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఐసీడీఎస్ సిబ్బందికి, అంగనవాడీలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ విజయరంగారావు నేతృత్వంలో రంగవళ్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ బి.సిమ్మాలమ్మ, సూపర్‌వైజర్లు దశారత్నం, మేరీ, తదితరులు పాల్గొన్నారు.


రంగవళ్లులను పరిశీలిస్తున్న మండల, ఐసీడీఎస్ అధికారులు

ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందివ్వాలని భద్రగిరి ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి సూచించారు. భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయంలోని తన కార్యాలయంలో అంగన్‌వాడీలకు పీపీ1, పీపీ2 పుస్తకాలతో పాటు ఆధార్‌శీల, నవచేతన పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా నిర్వహించాలని, 3, 4 ఏళ్ల వయసు పిల్లలకు పీపీ1 పుస్తకాలు, 4, 5, 6 ఏళ్ల వయసు పిల్లలకు పీపీ2 పుస్తకాలు అందివ్వాలన్నారు. పిల్లలకు ఏ విధంగా బోధన చేయాలన్న దానిపై శిక్షణ ఇచ్చేలా ఆధార్‌శీల, నవచేతన పుస్తకాలు ఉపకరిస్తాయన్నారు.

నేటి నుంచి పోటీలు


మాట్లాడుతున్న గ్రంథపాలకుడు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాలలో భాగంగా మంగళవారం నుంచి మూడు రోజులు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు గణేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ.. చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో 6–10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు ఆరో తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గొన్నాబత్తుల దుర్గారావు విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను వివరించారు.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: ఈనెల 4న జరగనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ చేతుల మీదుగా కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసి మళ్లీ రేషన్ కష్టాలు తీసుకువచ్చారన్నారు. కొండలపైకి రేషన్ సరుకులు మోసుకెళ్లలేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఎటువంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు వెంకునాయుడు, ప్రదాని, విజయకుమారి, ఎ.కళావతి, ఎంపీటీసీ సభ్యులు ఎస్.మంగయ్య, ఎస్.చంద్రశేఖరరావు, జి.కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, నిమ్మక కాంతారావు, ఎం.మురళి, కె.సోమేషు, ఎస్.అబ్బాస్, బి.అప్పారావు, ఎస్.వెంకటేష్, మోజేష్, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస రూరల్: కురుపాం నియోజకవర్గ కేంద్రంలో జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు కోరారు. మండలంలోని చినమేరంగి కోటలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.


భామిని: వడ్డంగిలో వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గరుగుబిల్లి: మండలంలోని ఖడ్గవలస జంక్షన్ వద్ద కురుపాంలో ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పార్టీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు తదితరులు కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనిని ప్రజలకు పొడిచిన వెన్నుపోటుగా భావించి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు కె.కూర్మినాయుడు, నాయకులు అంబటి గౌరునాయుడు, బొత్స అప్పలనాయుడు, వాసిరెడ్డి చంద్రమౌళి బి.సింహాచలంనాయుడు, ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు కురుపాంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కార్యక్రమ వాల్‌పోస్టర్లను జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, పార్టీ నాయకులు గోరిశెట్టి గిరిబాబు, తోయక గోపాల్, నిమ్మక నాగేశ్వరరావు, కె.వెంకటరావు, వహీద్ ఖాన్ తదితరులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కూట మి ప్రభుత్వం మోసగిస్తుండడాన్ని వెన్నుపోటుగా భావిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరు కావాలన్నారు. ఇదే కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మండంగి శంకరరావు, బిడ్డిక సూర్యం, వైస్ సర్పంచ్ కె.కిశోర్ పాల్గొన్నారు.


జియ్యమ్మవలస రూరల్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


వీరఘట్టం: వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దమలపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు


పాలకొండ: వెన్నుపోటు దినం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెన్నుపోటు చంద్రబాబు నైజం..

వీరఘట్టం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడి వెన్నుపోటు చరిత్ర రాష్ట్ర ప్రజలందరికీ ఇప్పుడు తెలుస్తోందని వీరఘట్టం ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు. ఈ మేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన చంద్రబాబునాయుడు ఆ పార్టీలో మంత్రి పదవి అనుభవించి ఆ పార్టీకే వెన్నుపోటు పొడిచారన్నారు. తర్వాత మామ పంచన చేరి ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన విషయం ఎవ్వరూ మరిచిపోలేరని తెలిపారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయకపోవడంతో పాటు వలంటీర్లకు పది వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఏకంగా తీసేశారని మండిపడ్డారు. ఊరూరా మద్యం ఏరులై పారించి రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి శ్రీను, భోగి మణి, జలుమూరు అమర్‌నాథ్, అంబళ్ల రవి, భోగి మదన్, దౌలూరు శ్రీకాంత్, శిర్లాపు జగన్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

- విజయవంతం చేయండి..

పాలకొండ: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణితో రాష్ట్ర ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పాలకొండ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కనపాక సూర్యప్రకాశరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మధరరావు అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగించడంతో ఈనెల 4న పాలకొండలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పాలవలస ఇంటి వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, నల్లి శివప్రసాద్, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, లోలుగు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

- రైతులను నట్టేట ముంచారు..

భామిని: కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వడ్డంగిలో రైతులతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులకు ఇంతవరకు విత్తనాలు, ఎరువులు అందివ్వలేదన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బోదెపు జగన్, రైతులు పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం: వెన్నుపోటు దినం కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దీనమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు రాధిక తదితరులు


గరుగుబిల్లి: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ అచ్యుతరావు

క్లుప్తంగా

భూగర్భజలాల సంరక్షణకు చర్యలు


చినగుడబలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు చేపట్టడం జరుగుతోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని చినగుడబ, ఉద్దవోలు, గరుగుబిల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె సోమవారం పరిశీలించారు. రోజురోజుకూ భూగర్భజలాలు తగ్గుతున్న నేపథ్యంలో వాటిని పెంచుకునేందుకు ఫారంపాండ్‌ల నిర్మాణం తప్పనిసరన్నారు. ప్రతి గ్రామంలో ఫారంపాండ్‌ల నిర్మాణం జరిగేలా చూడాలని సిబ్బందికి తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


దుగ్గిలో ప్రచారంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

కొమరాడ: మండలంలోని కళ్లికోట, దుగ్గి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులంతా త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పించారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మల గూర్చి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతమని పేర్కొన్నారు. భగవద్గీతలో కర్మ, బ్రహ్మ, భక్తి యోగాలనుసారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడి మనిషికి ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటరావు, శంకరరావు, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు సౌకర్యం కల్పించాలని జియ్యమ్మవలస మండలం, ద్రాక్షిణి గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొండచిలకాం జంక్షన్ నుంచి ద్రాక్షిణి గ్రామం వరకు రోడ్డు సదుపాయం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వితరణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు)కు గుమ్మలక్ష్మీపురానికి చెందిన వ్యాపారి, వైఎస్సార్ సీపీ కురుపా నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఓ గోడ గడియారం వితరణ చేశారు. ప్రిన్సిపాల్ యుగంధర్‌కు ఆ గడియారాన్ని సోమవారం అందజేశారు.

కాంగ్రెస్ పార్టీని బలపరచండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కాంగ్రెస్ పార్టీని బలపరచాలని ఆ పార్టీ కురుపాం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ పెద్దల సూచనల మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు.

విత్తనాల పంపిణీ


రైతులకు విత్తనాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: రైతులు రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల సంఘ మండల ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు టి. ఉపేంద్రకుమార్ అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామ సచివాలయ పరిధిలోగల అన్నదాతలకు సోమవారం విత్తనాలు అందించారు. వాతావరణ అనుకూలతను, భూ స్వభావం, సారాన్ని పరిగణలోకి తీసుకుని విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ క్షేత్ర సహాయకుడు అమిత్‌పాడి సూచించారు. వర్షాలు తగ్గుముఖం పడితే దుక్కులు పూర్తి చేసి వెదలు చల్లేందుకు సిద్ధపడుతున్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై వీఏఏ పలు సూచనలు చేశారు.

శ్రమదానం..

సీతానగరం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు సోమవారం శ్రమదానం నిర్వహించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించారు. తహసీల్దారు ఆదేశాల మేరకు ఈ పనులు చేశామన్నారు.